కథ




# ఎవరు? దొంగ

తటవర్తి రామచంద్రరావు

సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ టేబుల్ ముందు కూర్చుని దీర్ఘాలోచనలో మునిగివున్నాడు.

ఏదైనా కేసు స్టడీ చేస్తుంటే అతని ఏకాగ్రత ఎంత పటిష్టంగా ఉంటుందంటే స్టేషన్‌లో బాంబు పేలితే అతను స్పృహలోకి రాడని ప్రతీతి!

సాక్ష్యాధారాలున్నాయి. సాక్షుల వాఙ్మూలాలు తీసుకోవటం జరిగింది. కాని, నిందితుడు నేరాన్ని ఒప్పుకోవటం లేదు. అతన్ని ఎలా క్రాస్ ఎగ్జామిన్ చేయాలా అని తర్జన భర్జన పడుతున్నాడు.

వక్కగదిలో సందడిగా ఉంది. సబ్‌ఇన్‌స్పెక్టర్ సర్వారాయుడు ఎవర్నో పట్టుకొని గంటనుంచి అరుస్తున్నాడు. కరుస్తున్నాడు. చమడాలెక్కదీస్తున్నాడు. ప్రసాద్‌కి అవన్నీ కొంచెం కొంచెంగా వినిపిస్తూనే ఉన్నాయి. అయినా, అతని ఏకాగ్రత సడలలేదు!

బయటగదిలోని వారికి పూజాగదిలోని భజగోవిందం శ్రవణానందం. టిఫిన్ తినేవాళ్ళకి హోటల్లో సినిమాపాటలు చెవులకి విందు. పోలీసువాడి గొంతు నిందితుడి కేక లయబద్ధంగా వినిపించటం పోలీసుస్టేషన్‌లో ఒక బాక్‌గ్రౌండ్ మ్యూజిక్!

ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు. ప్రసాద్ తన కేస్ స్టడీలో లీనమైపోయాడు. కాగితాలు తిరగవేస్తుంటే ఉన్నట్టుండి వక్కగదిలోని శబ్దాల్లో ఏదో అపశ్రుతి వినిపించినట్టయిందతనికి!

క్షణం పాటు ఆలకించాడు. సర్వారాయుడి జీరగొంతు ఖంగుఖంగుమంటోంది. కాని... నిందితుడి స్వరం ఎక్కడా వినబడటంలేదు. బెల్టుతో కొడుతున్న చప్పుళ్లు ఠాప్ ఠాప్‌మంటున్నాయే కాని... దెబ్బలు తింటున్న మనిషి కిక్కురమనటం లేదు. అలా ఎలా జరుగుతోంది?

పోలీసువాడి గావుకేకల వక్కన నిందితుడి చావుకేకలు జంటగా లేవు, అంటే ఆ మనిషి స్పృహ తప్పిపోయుండాలి లేక చచ్చిపోయుండాలి!

పోలీసుశాఖలో సర్వసాధారణమైన థర్డ్ డిగ్రీ మెథడ్స్ సర్వారాయుడు ఉపయోగిస్తాడు. నేరస్తుడ్ని పట్టుకోవడం కాదు. పట్టుకున్నవాడి చేత నేరాన్ని ఒప్పించడం అతని పద్ధతి. అది ఈజీ రూట్!

కాని, ప్రసాద్ దానికి పూర్తిగా విరుద్ధం. ఓర్పుగా ప్రశ్నించాలి. మంచిగా మాట్లాడాలి. మాటల్లో పెట్టి నేరస్తుడిచేత తప్పునొప్పించాలి. నిందితుడి జవాబుల్నిబట్టి నేరం చేశాడో లేదో గ్రహించగలగాలి. దీనికి చాలా టైం పడుతుంది. ఇది కష్టతరమైన పద్ధతి.

'ఒక నేరస్తుడ్ని పొరపాటున జారవిడిచినా ఫర్వాలేదు. ఒక అమాయకుడికి శిక్షపడకూడదు!' అన్న శిక్షాస్మృతిని అక్షరాలా నమ్మి ఆచరిస్తాడు ప్రసాద్.

అతని గుండె క్షణకాలం ఝల్లుమంది. ఒక్క ఉదుటున కుర్చీలోంచి లేచి పక్కగదిలోకి వెళ్లాడు. అక్కడ దృశ్యం చూసేసరికి భయం పోయి ఆశ్చర్యం కలిగిందతనికి.

దెబ్బలు కొట్టికొట్టి చేతులు నొప్పెట్టిన సర్వారాయుడు రొప్పుతున్నాడు. తాటలూడి కమిలిపోయిన నిందితుడు నిర్భయంగా నిశ్చలంగా నిలబడివున్నాడు!

"ఏమయింది?" అప్రయత్నంగా అడిగాడు ప్రసాద్.

"దొంగ రాస్కెల్.. కర్నల్ రాజారావుగారింట్లో గోల్డ్‌చైన్ కొట్టేశాడు. ఎంత తన్నినా తప్పొప్పుకోవటంలేదు."

"చైన్ దొరికిందా?"

"దొరికితే ఈ తంటాలెందుకు? ఈ... కొడుకుని ఎప్పుడో బొక్కలో తొక్కేసి మక్కెలిరగ్గొట్టుండే వాడ్ని!"

"ఇంతవరకు చేసింది అంతకంటె తక్కువా?" అని ప్రసాద్‌కి అనాలనిపించింది. కాని, అనలేదు.

అతనికి నీతి లేకపోవచ్చు. తనకు నియమం ఉంది. కానిస్టేబుల్స్ ఎదురుగా నిందితుడి సమక్షంలో తన కొలీగ్‌ని విమర్శించటం సబబు కాదు. అందుకే తనలో పొంగిన అసహ్యాన్ని మహాశివుడు గరళం మింగినట్టు గుటకవేశాడు.

"చైన్ పోయిందెక్కడ?"

"కర్నల్‌గారింట్లో!"

"పోయిందెప్పుడు?"

"ఈ పొద్దుటే!"

"ఇతని మీద అనుమానంగా ఉందని కర్నల్‌గారు చెప్పారా?"

"వాడిని ప్రశ్నలు వేయటం మానేసి నన్ను పట్టుకున్నావేమిటి?" అని వ్యంగ్యంగా నవ్వాడు సర్వారాయుడు.

"నీకభ్యంతరం లేకపోతే అతన్నే అడుగుతాను" అని నిందుతుడి వైపు తిరిగి "నీపేరు?" అని అడిగాడు ప్రసాద్.

అతను తలదించుకొని అలా నిలబడిపోయాడే కాని పలకలేదు. పెదవి కదపలేదు.

సర్వారాయుడు వైపు తిరిగి కళ్లతోనే అడిగాడు ప్రసాద్.

"ఏమో! నాకూ తెలీదు... ఏయ్ 407! నీగ్గాని తెలుసా?"

"తెలీదండి" అన్నాడు కానిస్టేబుల్ 407.

"నువ్వు అడిగావా?"

అదేదో ఘనకార్యం చేసినట్టు తల అడ్డంగా త్రిప్పి నవ్వుతూ "అడగలేదండి" అన్నాడు.

నిందితుడి పేరైనా తెల్సుకోకుండా నేరాన్ని ఒప్పించటానికి వీళ్లు ఒడిగట్టారంటే ఆశ్చర్యం కన్నా అసహ్యం కలిగిందతనికి.

"అడగటానికి టైమేదండి?" అన్నాడు 407.

"అంటే?"

"ఎస్సైగారితోపాటు కర్నల్‌గారింటికి ఎల్లేటప్పటికి ఆరు గొలుసు నెతుక్కుంటున్నారండి. ఇంట్లో పనోళ్లు ఇద్దరున్నారండి. ఆళ్లెప్పట్నించో పని చేస్తున్నారంట. ఆళ్లని ఎతికానండి. కాని, కనిపించలేదు. ఈడొక్కడే ఆడ కొత్తోడు. ఈడ్నీ ఎతికాను. కనిపించలేదు. ఎవరూ తీయకపోతే అరగంటక్రితం అక్కడే ఉన్న గొలుసు ఏమవుద్దాని కర్నల్‌గారి భార్య అడిగేరండి. బయటాడు ఈడొక్కడే!! ఈడే కొట్టేసుండాలి. అందుకనే, ఈడకి లాక్కొచ్చాం!" ప్రసాద్ కష్టపడి అడక్కుండానే సర్వారాయుడు చేసిన ఘనకార్యాన్ని చెప్పేశాడు 407.

"ఇతను కొత్తగా పనిలో చేరాడా?"

"లేదుటండి."

"మరి అక్కడెందుకున్నాడు?"

"కర్నల్‌గారొచ్చి కలవమంటే వచ్చాట్టండి."

"అంతా అబద్ధం! కర్నల్‌గారు మార్నింగ్‌వాక్‌కి వెళ్లగా చూసి లోపలికి దూరాడు. సందు దొరికిందని గొలుసు కొట్టేశాడు. అక్కడే ఎక్కడో దాచుంటాడు. ఏ రాత్రో వచ్చి పట్టుకుపోవచ్చని వాడి ప్లాన్. అది తెలుసుకుందామనే లాక్కొచ్చాను" అన్నాడు సర్వారాయుడు అతిశయంగా భుజాలెగరేస్తూ.

"కర్నల్‌గారు ఇతన్ని నిజంగా రమ్మన్నారా?"

"ఇలాంటి జులాయివెధవతో కర్నల్‌గారికి పనేముంటుంది?"

"అసలు ఆయన్ని అడిగావా?"

"కర్నల్‌గారి భార్య వాడ్నెప్పుడూ చూడలేదుట. ఆయన రమ్మనటం అబద్ధమేనని ఆవిడకీ అనుమానమే!"


"పోనీ, ఆయన్నే అడక్కపోయివా?"

"ఆయనింకా మార్నింగ్‌వాక్ నుంచి రాలేదు... ఆయన వచ్చేలోగా వీణ్ణో దుమ్ము దులిపి గొలుసెక్కడుందో తెలుసుకుందామని తీసుకొచ్చా!"

"ఆవిడ కంప్లైంట్ ఇస్తే నువ్వక్కడికి వెళ్లావన్నమాట!"

సర్వారాయుడి ముఖం ఎందుకో ఎర్రబడింది. "లేదు. డ్యూటీకి వస్తూ దార్లోనే వాళ్లిల్లు కదాని పలకరించి పోదామని వెళ్లా. సరిగ్గా సమయానికి వచ్చారు ఇన్‌స్పెక్టర్‌గారూ అంటూ ఆవిడ ఎంతో ఇదైంది!"

కర్నల్‌గారి భార్య పబ్లిక్ స్కూల్ మేనేజిమెంట్ కమిటీ మెంబరు. ఆ స్కూల్లో సర్వారాయుడి కొడుక్కి సీటు కావాలి. నేడో రేపో వెళ్లి అడుగుదామనుకుంటున్నానని రెండు రోజుల క్రితం ప్రసాద్‌తో తనే చెప్పాడు. తీరా వాళ్లింటికి వెళ్లేసరికి ఓ చక్కని కేసు తనకోసం రెడీగా ఉంది. రొట్టె విరిగి నేతిలో పడిందనుకున్నాడు. ఆవిడ్ని ప్లీజ్ చేయాలని కర్నల్‌గారు మార్నింగ్ వాక్ నుంచి మిగతా 66వ పేజీలో....



....63వ పేజీ తరువాయి

తిరిగి రాకుండానే ఇతన్ని లాక్కొచ్చాడు.

... సర్వారాయుడి బృహత్ర్పణాళికలోని అంతర్వ్యూహం అతనికర్థమైంది!

"407! ఆ స్టూల్ ఇలా తీసుకురా!" అన్నాడు ప్రసాద్.

కానిస్టేబుల్ 407 కుర్చీపీట తీసుకువచ్చాడు.

ప్రసాద్ అతని దగ్గరకు వెళ్లి భుజం మీద అనునయంగా చెయ్యివేసి "కూర్చో!" అన్నాడు.

అతను తలెత్తి చూశాడు.

ప్రసాద్ మందహాసం చేశాడు, "ఫర్వాలేదు. కూర్చో!"

అతను అప్రయత్నంగా కూర్చున్నాడు.

ప్రసాద్ సంజ్ఞ చేశాడు. 407 మంచినీళ్ల గ్లాస్ తెచ్చాడు.

"త్రాగు."

అంతవరకు చావు దెబ్బలు తిన్నా కరగని నీళ్లు ఇప్పుడు ఓదార్పుకి కరుగుతున్నాయి.

ఆ గ్లాసుని అతని చేతుల్లో తనే పెట్టాడు ప్రసాద్.

అతను గడగడ నీళ్లు త్రాగేశాడు.

"ఇంకా కావాలా?"

అతను తల అడ్డంగా తిప్పాడు.

"ఏమిటీ మర్యాదలు వీడికి?" అన్నాడు సర్వారాయుడు అసహనంగా.

"యు హేవ్ ట్రైడ్! లెట్ మి ట్రై! ప్లీజ్..."

సర్వారాయుడు ముఖం మాడ్చుకుని తన సీట్లోకి పోయి కూర్చున్నాడు.

"నీ పేరు చెప్పడం ఇష్టం లేకపోతే... పోనీ, నువ్వు కర్నల్ గారింటికి ఎందుకు వెళ్లావో చెపుతావా?"

"నా పేరు శివయ్య. నన్ను కర్నల్‌గారే వచ్చి కలవమన్నారండి." అతని కంఠం దృఢంగా పలికింది.

"వచ్చి అబద్ధం!" సర్వారాయుడు గొంతు చించుకున్నాడు.

"ప్లీజ్... అతన్ని చెప్పనీ!"

సర్వారాయుడు ముఖం మాడ్చుకున్నాడు.


కర్నల్‌గారు ఎందుకు రమ్మన్నారు?"

శివయ్య కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయాడు.

"నీకేం ఫర్వాలేదు. నిజం చెప్పు."

ప్రసాద్ స్వరంలో అనునయం ఉంది. ఆదరణ ఉంది. భయం లేదని భరోసా ఉంది.

శివయ్య చెప్పాడు. తొణక్కుండా చెప్పాడు.




మాటలు వెతుక్కోకుండా చెప్పాడు. వినేవాళ్లుంటే ఇదే నిజమన్నట్టు చెప్పాడు.

"వింటే ఎన్ని కట్టుకథలేనా చెపుతాడు" అన్నాడు సర్వారాయుడు వెటకారంగా.

"కర్నల్‌గారి నంబరేమిటి?" అని అడిగాడు ప్రసాద్.

"దేనికి?"

"అతను చెపుతున్నది నిజమో కాదో అడగటానికి"

"అంటే, వాడి మాటలు నువ్వు నమ్మేస్తున్నావన్నమాట!" అన్నాడు సర్వారాయుడు వ్యంగ్యంగా నవ్వుతూ.

ప్రసాద్ ఏదో అనబోయి ఆగిపోయాడు. గబగబా డైరక్టరీ తీసి నంబర్ నోట్ చేసుకున్నాడు. సర్వారాయుడు నోరు విప్పేలోగా ఫోన్ చేసేసాడు.

"... గుడ్‌మార్నింగ్ సార్! ఎస్.ఐ. ప్రసాద్‌ని మాట్లాడుతున్నాను. చైన్ కనిపించిందాండీ!... దర్యాప్తు చేస్తున్నామండి. తప్పకుండా కనిపిస్తుంది... అవునండి. మా ఎస్.ఐ. రాయుడుగారు శివయ్యని కస్టడీలోకి తీసుకున్నారు. శివయ్య మీకు తెలీదాండీ? కాని, అతన్ని మీరెరుగుదురని చెపుతున్నాడు... సో సార్! మీకా శ్రమ అక్కర్లేదు. అతన్ని మేమే మీ దగ్గరికి తీసుకువస్తాం. ఎస్సార్! వెంటనే బయల్దేరి వస్తున్నాం!..." అని ఫోన్ పెట్టేశాడు.

"చైన్ ఎక్కడుందో తెలీకుండా వెడితే కర్నల్‌గారి భార్య ముఖాన్న ఉమ్మేస్తుంది" అన్నాడు సర్వారాయుడు ముఖం గంటుపెట్టుకుని.

"కర్నల్‌గారింటికి ఇతను ఎందుకు వెళ్లాడు అన్నది ముందు తేలాలి. చిన్నదొంగతనానికి వెళ్లాడా? మరేదైనా పెద్ద దోపిడీ చేయటానికి వెళ్లాడా? ఇతనొక్కడే ఉన్నాడా? ఇతని వెనకాల ఏదైనా గ్యాంగ్ ఉందా?"

ప్రసాద్ మాటలకి శివయ్య నిరుత్తరుడయ్యాడు. కాని, సర్వారాయుడి ముఖం పువ్వుపువ్వులా విచ్చుకుంది. "ఎస్! నాకీ సంగతి తట్టనేలేదు సుమా!"

"ఓసారి మనమంతా కల్సి కర్నల్ గారింటికి వెడితే మంచిదని నా ఉద్దేశ్యం!"

సర్వారాయుడికిప్పుడు మహదానందంగా ఉంది. తన కొడుక్కి పబ్లిక్ స్కూల్లో సీటు దొరికిపోవటం ఖాయం... అని అతనికనిపించింది!

తనవైపు వెలవెలబోయి చూస్తున్న శివయ్యతో, "నువ్వు చెప్పింది నిజమైతే నీకేం భయంలేదు" అన్నాడు ప్రసాద్.

మరో పావుగంటలో జీపులో కర్నల్ రాజారావుగారింటికి చేరారు అందరూ.

"ఇతనేనండి శివయ్య" అన్నాడు ప్రసాద్.

శివయ్య నమస్కారం చేశాడు.

కర్నల్‌గారు పలకరింపుగా నవ్వి "అరే, ఇతన్ని పేరడగటం మర్చిపోయాను" అన్నాడు.

"నిన్న బాంకు నుండి వస్తుండగా మీకోటు జేబులోంచి పర్సు కింద పడిపోయిందని... దాన్ని చూసి మీ ఆఫీసు వెతుక్కుంటూ వచ్చి దాన్ని మీకిచ్చానని అతను చెబుతున్నాడు. అది నిజమేనా?"

"అవును. నా పర్సులో పదివేలున్నాయి. చెక్కుచెదరకుండా తెచ్చిచ్చాడు. వందరూపాయలియ్యబోతే వద్దన్నాడు. తనకేదైనా పని చూపించమన్నాడు. అందుకే రమ్మన్నా!" అన్నారు కర్నల్‌గారు.

ప్రసాద్ చూపులు గుచ్చుకున్నట్టయి సర్వారాయుడు ముఖం తిప్పుకున్నాడు.

నిప్పులు చెరిగే ఎండలోంచి చెట్టు నీడకి చేరినట్టు శివయ్య గాఢంగా నిట్టూర్చాడు.

"మీ ఇంట్లో జరిగిన దొంగతనానికి ఇతన్ని అనుమానించవచ్చంటారా?"

అంతకుముందే అక్కడకు వచ్చి వాళ్లమాటలు వింటున్న కర్నల్‌గారి భార్య "మా మనవరాలు ఇక్కడ ఆడుతుండగా వాడొక్కడే ఇక్కడున్నాడు. ఇంక వాడు కాక ఎవరు తీసుకుంటారు?" అంది కటువుగా.

ఆవిడ మాటలు పట్టించుకోకుండా "ఏమంటారు సార్?" అని అడిగాడు ప్రసాద్.

అంతవరకు జరిగిందానికి సర్వారాయుడికి సిగ్గుచేటుగా ఉంది. "... ముందు మీ జేబులోంచి పర్సు కొట్టేసి... తర్వాత మీకు తెచ్చిచ్చి మీదగ్గర మంచితనం సంపాదించటానికి ఈ ప్లాన్ వేశాడు సార్! దొంగబుద్ధి ఎక్కడికి పోతుంది! చిన్నపిల్ల కదా... ఏం చెప్పగలుగుతుందని లాగేసి దాచేసుంటాడు." అన్నాడు.

అతనివైపు మెచ్చుకోలుగా చూసింది కర్నల్‌గారి భార్య వరమానందంతో మురిసిపోయాడు ఎస్.ఐ. రాయుడు.

"చెప్పండి సార్!" అని మళ్లీ రెట్టించాడు ప్రసాద్.

"నాకేమిటో అంతా అయోమయంగా ఉంది!" అన్నాడు కర్నల్‌గారు తనలో తాను అనుకుంటున్నట్టు.

"అంతకు ముందు ఉన్నది ఎవరూ తీయకపోతే ఒక్కసారిగా ఎలా మాయమవుతుంది?" అని రెట్టించింది కర్నల్‌గారి భార్య.

"వాడే తీసుంటాడు మేడమ్! గంట నుండి చావచితక్కొట్టాను. కాని, ఎక్కడ దాచాడో చచ్చినా చెప్పలేదు వెధవ!" అన్నాడు సర్వారాయుడు ఉడుక్కుంటూ.

"మీ మనవరాల్ని ఒకసారి తీసుకువస్తారా?" ప్రసాద్‌వైపు అంతా చిత్రంగా చూశారు.

"అది చిన్నపిల్ల. తానేం చెప్పగలదు?" అంది ఆవిడ.

"మీకభ్యంతరం లేకపోతేనే..."

కర్నల్‌గారే నౌకర్ని కేకవేసి పిల్లని తీసుకురమ్మన్నారు.

మూడేళ్లుంటాయి. రబ్బరుబొమ్మలా ఉంది. ప్రసాద్ నవ్వుతూ చేతులు ముందుకు చాచాడు. చిరునవ్వు నవ్వుతూ చటుక్కున అతని దగ్గరికి వచ్చింది.

"మా మనవరాలికి ఎవరి దగ్గరా కొత్తలేదు" అంది ఆవిడ గర్వంగా.

"వీడు కుడా అలాగే పిల్లనెత్తుకొని ఏమరుగ్గా గొలుసు లాగేసుంటాడు" అన్నాడు సర్వారాయుడు అక్కసుగా.

శివయ్య దగ్గరికి నడిచాడు ప్రసాద్. "పాపనెత్తుకో!" అని అందివ్వబోయాడు.

"మాసిపోయిన బట్టలూ వాడూ... వాడ్నెత్తుకోమంటారేమిటి?" అని వారించబోయింది కర్నల్‌గారి భార్య.

ప్రసాద్ శ్రమపడవలసిన అవసరం లేకపోయింది. ఆపిల్ల శివయ్య దగ్గరకి వెళ్లలేదు... ప్రొద్దుట కూడా వెళ్లివుండదు అని అతనికర్థమయ్యింది.

"నువ్విక్కడికి వచ్చినప్పుడు ఈ పిల్ల మెల్లో గొలుసు ఉందా?"

"ఏమో సార్! నాకు తెలీదు. బాబుగారికోసం ఈడనే నిలబడిపోయినా!"

"ఆ పిల్ల అప్పుడు ఎక్కడుందో చెప్పగలవా?" ఆచోటు చూపించాడు శివయ్య.

"నిజమేనా?" అని కర్నల్‌గారి నౌకర్ని అడిగాడు ప్రసాద్.

"నిజమేనండి. పాపని నేనే సోఫాలో కూర్చోబెట్టా."

ప్రసాద్ పాపని సోఫాలోకి దించి తను క్రింద వొంగి కూర్చుని "పాపా! నీకు ఎగిరి గంతులేయడం వచ్చా?" అని నవ్వుతూ అడిగాడు.

"ఓ!" అంది పాప భుజాలెగరేస్తూ.

"నాకురాదు. నాక్కొంచెం నేర్పవా?" అని మురిపెంగా అడిగాడు.

పాప పకపక నవ్వింది. అంతా వింతగా చూడసాగారు.

"చూపిస్తే చాక్లెట్లు కొనిపెడతా!"

పాప సోఫాలో గంతులు వేసింది.

"అంతేనా! ఇంకేం రాదూ?"

చిన్నగా నవ్వి రెండుసార్లు పిల్లి మంత్రం వేసింది.

ప్రసాద్ ముఖం వికసించింది. గబుక్కున వొంగి సోఫా కిందికి చూశాడు.

"గొలుసు అక్కడ కూర్చుందనుకున్నారా? అవన్నీ ఎప్పుడో వెతికాము" అంది కర్నల్‌గారి భార్య వెటకారంగా.

ప్రసాద్ ఆవిడ మాటల్ని పట్టించుకోలేదు. సోఫాలోకి వంగి బాగా పరిశీలనగా చూశాడు.

"టార్చిలైటుంటే కొంచెం ఇస్తారా?"

నౌకరు తెచ్చిచ్చాడు. సోఫాలో మూలమూలకీ టార్చి ఫోకస్ చేసి వెతికాడు ప్రసాద్. అతని ముఖంలో ఒక్క వెలుగు వెలిగింది. "అంతా తలో చెయ్యి వెయ్యండి..."

అంతా కల్సి సోఫాని తలక్రిందులు చేశారు... ఏ మూలనుంచి పడిందో... చటుక్కున నేలమీద పడింది పాప గోల్డ్‌చైన్!

"పాప పిల్లిమొగ్గ వేసినప్పుడు... మెడలోంచి చైన్ బయటికి వచ్చేసింది. ఆపిల్ల గంతులకి ఆది జారి సోఫా బేక్‌కి, సీటుకి మధ్యున్న జాగాలో ఇరుక్కుపోయింది!..." అన్నాడు ప్రసాద్.

ఎస్.ఐ. సర్వారాయుడి ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు.

కర్నల్‌గారి భార్య వదనం కాలిన వంకాయిలా అయిపోయింది.

శివయ్య ఎటువంటివాడో తెల్సికూడా పెదవి కదపనందుకు కర్నల్ రాజారావుగారి తల దించుకుపోయింది.

ప్రసాద్ శివయ్యవైపు చూశాడు.

అన్ని దెబ్బలు తినటానికి శివయ్యలో అంతశక్తి ఎక్కడ్నుంచి వచ్చిందో ముందతనికి ఆశ్చర్యం కలిగించింది. కాని, ఇప్పుడది వింతగా లేదు.

అదే నిర్మలత్వం. అదే నిజాయితీ. అతనికి దొరికిన అచంచలమైన శక్తి!

ప్రసాద్ శివయ్యకి దగ్గరగా వచ్చాడు. ఆప్యాయంగా చూశాడు. అభినందనపూర్వకంగా భుజం తట్టాడు. అంతలోనే అతని మనస్సుకేదో స్ఫురించింది. ఒక్క నిమిషం ముందు తను గది బయటకు వచ్చుంటే ఆ అర్భకుడికి అన్ని దెబ్బలు తప్పుండేవి కదా అని మనస్సు చివుక్కుమంది. అపరాధ భారంతో గుండె నిండింది. మనసు ఆర్ద్రమయింది.

"సారీ శివయ్యా!" అతని కళ్లు చెమరుస్తున్నాయి.

గంటక్రితం సర్వారాయుడి చావు దెబ్బలకి కరడు కట్టుకుపోయాడు శివయ్య. కాని, ఇప్పుడు ప్రసాద్ వాత్సాల్యపూరితమైన కరస్పర్శకి కరిగి నీరైపోయాడు.

నిజాయితీని మంచితనం పొదివి పట్టుకొని నిటారుగా నడిచివెళ్లిపోయింది!

అధికారమదం, స్వార్థం, సంకుచిత్వం అక్కడే వంగి కుంగి కూలబడిపోయాయి! ■

